నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 15 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూడాలి



బతుకమ్మ వాగు వద్ద ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్, ఫిబ్రవరి 14 : రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగు నీటికి ఇబ్బందుల్లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని, నిరంతరాయంగా తాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం చెన్నూర్ పట్టణంలోని బతుకమ్మ వాగు వద్ద తాగు నీరు సరఫరా చేసే ట్యాంకును, బట్టిగూడెం కాలనీలోని వాటర్ ట్యాంకును పరిశీలించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీరందించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణను ఆదేశించారు. పైపులైన్ల మరమ్మతులుంటే వెంటనే చేపట్టాలని సూచించారు. అమృత్ పథకంలో భాగంగా తాగు నీటి ట్యాంకుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## మూడు మస్టర్లు అమలుచేయాలి

ఆర్టీసీ డీఎంకు టిమ్ డ్రైవర్ల వినతి



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న టిమ్‌డ్రైవర్లు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14 : మంచిర్యాల–చెన్నూర్, అక్కడి నుంచి హైదరాబాద్‌కు నడుపుతున్న ఎన్‌ఏహెచ్ 4 సర్వీసుకు ఇప్పటి వరకు మూడు మస్టర్లు ఇచ్చేవారని, అకస్మాత్తుగా రెండుకు తగ్గించారని, తిరిగి మూడు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మంచిర్యాల ఆర్టీసీ డీఎం జనార్దన్‌కు టిమ్ డ్రైవర్లు వినతి పత్రం అందజేశారు. చెన్నూర్ సర్వీసు డ్యూటీని మూడు మస్టర్లుగా పునరుద్ధరించాలని, లేకపోతే టిమ్ డ్యూటీలు చేసేందుకు అనుకూలంగా లేమని స్పష్టం చేశారు. ఇకనైనా యథావిధిగా మస్టర్లు అమలు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో టిమ్ డ్రైవర్లు పీ సుదర్శన్, ఎంబీ రెడ్డి, వై సత్తయ్య, ఎండీ రఫీయుద్దీన్, సీహెచ్ వెంకటేశ్, తిరుపతి ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

దళితుల నోట్లో మట్టికొట్టి కోట్లు దండుకునేందుకు ఎమ్మెల్యే పీఎస్సార్ ప్లాన్

# ఐటీపార్క్ పేరిట భూ దందాకు స్కెచ్

- అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలి
- కోట్లు పలికే భూములకు రూ. 13 లక్షలా ?
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- బెదిరింపులకు గురిచేస్తున్నారు : బాధితులు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14 : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే వేంపల్లి, పోచంపాడ్ శివారులో ఐటీ పార్క్ ఏర్పాటు పేరిట దళితులు, రైతులను బెదిరించి వారి భూములు లాక్కోవడానికి ఎమ్మెల్యే పీఎస్సార్, అతని అనుచరులు భారీ స్కెచ్ వేశారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. శుక్రవారం మంచిర్యాలలోని తన నివాసంలో భూములు కోల్పోతున్న బాధితులు, అడ్వకేట్ దొమ్మటి అర్జున్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోచంపాడ్, వేంపల్లి శివారులోని భూములన్నీ దాదాపు దళిత రైతులవేనని, వారి నోట్లో మట్టికొట్టి కోట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. తక్కువ ధరకు భూములు ఇవ్వాలని ఎమ్మెల్యేతో పాటు అతని అనుచరులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అధికారులు సైతం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. చట్టప్రకారం నడుచుకోవాల్సిన అధికారులు కూడా అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. భూసేకరణ కోసం ముందుగా నోటీసులు ఇవ్వాలని, వివరాలను పబ్లికేషన్ చేయాల్సి ఉంటుందని, మార్కెట్ ధరను దృష్టిలో పెట్టుకుని భూముల ధర నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. కానీ ఇటీవల ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో దళిత రైతులతో సమావేశం ఏర్పాటు చేసి ఈ భూములన్నీ అసైన్డ్‌వేనని, మీరు ఇచ్చినా ఇవ్వకున్నా భూములు తీసుకుంటామని, తాము చెప్పిన ధరకే ఒప్పుకోవాలని బలవంతం చేశారన్నారు. బాధితులైన దళిత రైతులను కలిసేందుకు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వచ్చిన సందర్భంలో పెద్ద సంఖ్యలో పోలీస్ పికెటింగ్‌లు పెట్టారని, రైతులను కలువకుండా చేశారని మండిపడ్డారు. దాదాపు 300 ఎకరాల భూమిని సేకరించాలని చూస్తున్నారని, ఎకరాకు కేవలం రూ. 13 లక్షలకు సేకరించి.. వాటిలో రోడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించి ఎకరాకు రూ. రెండు కోట్లకు పైగా అమ్మేయాలన్నది ఎమ్మెల్యే పీఎస్సార్ ప్లాన్ అని, అందుకు అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. భూసేకరణ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టులు ఇచ్చిన తీర్పులను పాటించాలని, దళితులకు ఇచ్చిన భూముల్లో వారికే దళితబంధు ఇచ్చి కంపెనీలు పెట్టించాలని, ఆర్థికసాయం అందించి వారి అభివృద్ధికి దోహదపడాలని అన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన వారికి అప్పటి భూమి విలువ కేవలం రూ. 15 వేలు మాత్రమే ఉంటే.. తాము రూ. 1.82 లక్షలు ఇప్పించామని గుర్తు చేశారు. అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలని, నిబంధనల ప్రకారం భూసేకరణ చేపట్టాలని, దళిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, భూములివ్వాలని తమను బెదిరింపులకు గురిచేస్తున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భూములు కోల్పోతున్న రైతులు గజ్జెల్లి లక్ష్మి, మాడుగుల నర్సయ్య, నాగమల్ల ప్రకాశ్, మాడుగుల సతీశ్, గజ్జెల్లి రాజశేఖర్, మాడుగుల పెద్దపోశం, బీఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, వేంపల్లి, ముల్కల, పోచంపాడ్ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

- కుటుంబ పోషణకు అష్టకష్టాలు
- పట్టించుకోని ఏజెన్సీలు, సర్కారు
- ఈ నెల 17 నుంచి సమ్మెకు వెళ్లనున్న కార్మికులు



వేతనాలు చెల్లించాలని కోరుతూ జనవరి 20న హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

# వేతన వ్యథ

ప్రభుత్వ దవాఖానల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి నాలుగు నెలలుగా అందని జీతాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ) : సర్కారు దవాఖానల నిర్వహణలో కీలకపాత్ర పోషించే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు అందక అవస్థలు పడతున్నారు. నాలుగు నెలలవుతున్నా పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నెల 17 నుంచి సమ్మెకు దిగుతున్నారు.

**జిల్లాలోని ఏడు దవాఖానల్లో 100 మంది..**

వైద్య విధాన పరిషత్ పరిధిలోని జైనూర్, వాంకిడి, తిర్యాణి, కెరమెరి, సిర్పూర్–టీ, కాగజ్‌నగర్‌తో పాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో సుమారు 100 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి నాలుగు నెలలుగా వేతనాలు రాక అవస్థలు పడుతున్నారు. వార్డులు శుభ్రం చేయడం, సెక్యూరిటీ విధులు నిర్వహించడం, పేషెంట్లకు అన్ని రకాల సేవలందించే ఈ చిరు ఉద్యోగులకు సకాలంలో జీతాలివ్వకపోవడంతో కుటుంబ పోషణకు అష్టకష్టాలు పడుతున్నారు. తమ వేతనాలు చెల్లించాలని జనవరి 20న హాస్పిటల్ సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఇంత వరకు స్పందించలేదని, కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు వేతనాలు చెల్లించడంలో ప్రభుత్వం, ఏజెన్సీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, అందుకే ఈనెల 17 నుంచి సమ్మెలోకి వెళ్తున్నామని కార్మికులు స్పష్టం చేశారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్‌తో పాటు అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు.

### సమ్మె తప్పడం లేదు



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. వీరంతా చాలీచాలని జీతాలతో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఆ తక్కువ వేతనం కూడా సకాలంలో చెల్లించడం లేదు. దీంతో కుటుంబాలను పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి నెట్టుకొస్తున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తో పాటు వైద్య, ఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. అందుకే ఈ నెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా సమ్మె చేపడుతాం. వైద్య, ఆరోగ్య శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఈ నెల 19న హైదరాబాద్‌లోని కార్యాలయాన్ని ముట్టడిస్తాం.

*- బోగె ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి*

## ప్రజలు మళ్లీ కేసీఆరే సీఎం కావాలనుకుంటున్నారు

- ఐసీడీఎస్ మాజీ రీజినల్ ఆర్గనైజర్ అత్తిసరోజ
- కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని మహిళలతో కలిసి మొక్కలు నాటివేత



మంచిర్యాలలో మొక్క నాటుతున్న అత్తి సరోజ, మహిళలు

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రజలంతా మళ్లీ కేసీఆరే సీఎం కావాలని కోరుకుంటున్నారని ఐసీడీఎస్ మాజీ రీజినల్ ఆర్గనైజర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు అత్తి సరోజ పేర్కొన్నారు. ఈ నెల 17న కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం మంచిర్యాల పట్టణంలోని జన్మభూమినగర్‌లోగల వినాయక ఆలయం సమీపంలో మహిళలతో కలిసి మొక్కలు నాటారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్లలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. అన్ని వర్గాల కోసం అనేక పథకాలు అమలు చేసిన ఘనత ఆయనదేనని కొనియాడారు.



## పత్తి రైతుల పరేషాన్

- కొనుగోళ్లు నిలిపివేయడంతో జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు
- వాహనాల చార్జీల భారం పడుతుందని ఆవేదన

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని హీన జిన్నింగ్ మిల్లు పెద్ద సంఖ్యలో నిలిచిన పత్తి వాహనాలు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 14 : జిల్లాల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. సర్వర్ డౌన్ పేరిట సీసీఐ సుమారు పది రోజులుగా కొనుగోళ్లకు బ్రేక్ వేయగా, పత్తి వాహనాలతో జిన్నింగ్ మిల్లుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఏ జిన్నింగ్ మిల్లు వద్ద చూసినా వందల సంఖ్యలో వాహనాల వరుసలు కనిపిస్తున్నాయి. ఒక్కో వాహనానికి రోజుకు రూ. 1000 నుంచి రూ. 1200 దాకా వెయిటింగ్ చార్జీలు భరించాల్సి వస్తున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా సీసీఐ కొనుగోళ్ల లక్ష్యం పూర్తయ్యిందని, సోమవారం నుంచి సీసీఐ కొనుగోళ్లు ఉండబోవని వార్తలు వస్తున్న నేపథ్యంలో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ఏదేమైనా పత్తి కొనుగోళ్లు చేపట్టి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

### నేడు బీఆర్ఎస్ భవన్‌లో హరితహారం

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 14 : ఈ నెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని నేడు నస్పూర్‌లోని జిల్లా కార్యాలయంలో హరితహారం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు ఆధ్వర్యంలో మొక్కలు నాటడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 14 : ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు వేగంగా చేపట్టి మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీతో కలిసి ప్రధానమంత్రి శ్రీ పథకం కింద ఎంపికైన 18 విద్యాలయాల ప్రధానోపాధ్యాయులతో పాటు ప్రత్యేకాధికారులు, ఇంజినీరింగ్, విద్యాశాఖ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో అదనపు గదులు, మూత్రశాలలు, ప్రహరీ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, సైన్స్ ల్యాబ్, ఫ్యాన్లు, సీసీ కెమెరాలవంటివి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణాళిక సమన్వయకర్త అబిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

**ఓటు హక్కు వినియోగించుకోవాలి**

మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్–కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిల్లో అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

## అటవీ ఆంక్షలు ఎత్తివేయాలి

- వాహనదారుల డిమాండ్
- మండల కేంద్రంలో ఆందోళన
- ఎఫ్‌డీపీటీ శాంతారాంకు వినతి

జన్నారం, ఫిబ్రవరి 14 : కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో విధించిన ఆంక్షలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వాటిని ఎత్తివేయాలని ప్రజలు, వాహనదారులు డిమాండ్ చేశారు. శుక్రవారం జన్నారంలోని ఆర్ఆర్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్‌వో శివ్‌ఆశిష్‌సింగ్ ఎన్‌జీవోలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని.. అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. అటవీశాఖ చెక్‌పోస్టుల వద్ద రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటలకు వరకు వాహనాల రాకపోకలను కొనసాగించాలని ఎఫ్‌డీపీటీ శాంతారాంకు వినతి పత్రం అందజేశారు. సమస్యలు సర్కారు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని శాంతారాం చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త శ్రీరాముల భూమాచారి, వ్యాన్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ బాబా, నాయకులు ఎస్‌కే అక్రం, ముత్యం సతీశ్, రాజశేఖర్, ముస్తాఫా పాల్గొన్నారు.



జన్నారం ఎఫ్‌డీపీటీ శాంతారాంకు వినతి పత్రం ఇస్తున్న వాహన దారులు



కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

## గిరి రైతులకు న్యాయం చేయాలని ధర్నా

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 15 : తిర్యాణి మండలం మంగి గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రబండ గిరిజన రైతులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. దినకర్ మాట్లాడుతూ ఎర్రబండకు చెందిన గిరిజన రైతులు 40 ఏళ్లుగా కాస్తు కబ్జాలో ఉన్న భూములను సాగు చేసుకుంటున్నారని, ఆ భూములకు గతంలో రెవెన్యూ అధికారులు పట్టాలు కూడా మంజూరు చేశారన్నారు. ప్రస్తుత తహసీల్దార్ వారి పట్టాలు రద్దు చేసినట్లు తెలపడంతో పాటు వారిని భయాందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్‌లో గిరిజనుల పట్టాలు తొలగించడంతో వారికి పహనీ, 1బీ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫిర్యాదు చేసినప్పుడు 15 రోజుల్లో విచారణ జరిపి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడేమో నోటీసులు పంపుతున్నారని తెలిపారు. గిరిజన రైతులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, గేడం టీకానంద్, కృష్ణమాచారి, తిరుపతి, నిర్వాసిత రైతులు, కినక జన్గు, మర్సుకోల బాజిరావ్, గ్రామ పటేల్ ఆత్రం ఆత్మరావ్, కొర్వేత దేవ్, సోయం చిత్రూ, కినకమాంకు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బస్తీవాసులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 14 : బెల్లంపల్లి పట్టణంలోని రెండోవార్డు ఇందిరమ్మ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలని బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు సబ్బని అరుణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో హరికృష్ణకు బస్తీవాసులతో కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో ఇందిరమ్మ కాలనీలో అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించగా, కొందరు ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. బస్తీ ప్రజల ఆందోళనతో ఆ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని తహసీల్దార్ కూల్చివేశారని గుర్తు చేశారు. ఆ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేసి, పక్కా భవనం నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు జూపాక భాగ్యలక్ష్మి, మద్దుల జమున, కృష్ణపల్లి కళావతి, ఎండీ అజీమా బేగం, ఆరెల్లి మల్లయ్య, రంగం మహేశ్, సంబోధి సురేశ్ పాల్గొన్నారు.